క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ముగ్గురు సహాయ మహిళా వంట కార్మికుల తాత్కాలిక భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంఈఓ ప్రవీణ్ బాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన స్థానిక మహిళలు 30లోగా విద్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు.

పశుగణనకు సహకరించండి



పశుగణన చేస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలో కొనసాగుతున్న పశుగణన కార్యక్రమానికి పాడిరైతులు సహకరించాలని మండల పశువైద్యాధికారి శ్వేత పిలుపునిచ్చారు. మండల కేంద్రంతో పాటు లింగారెడ్డిపల్లిలో సోమవారం పశుగణన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ పశుగణన రెండు నెలల పాటు కొనసాగుతుందన్నారు. ప్రతి రైతు తమ పాడి పశువుల ట్యాగు నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఏ శ్రీనివాస్, హరిప్రసాద్, గోపాలమిత్రులు కనకస్వామి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీలో చేతివాటం: శ్రీనివాస్



రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉచితంగా పంపిణీ చేసే చేపపిల్లల పంపిణీలో కాంట్రాక్టర్‌లు చేతివాటం ప్రదర్శిస్తున్నారని, ఫలితంగా ముదిరాజ్‌లకు అన్యాయం జరుగుతోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జంగిటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉచిత చేపపిల్లల పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. పంపిణీలో కోతపెట్టారని, దానితో పాటు కాంట్రాక్టర్‌లు, అధికారులు కుమ్మక్కై చేపపిల్లలను రాత్రిపూట వదులుతూ చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ఆయన వెంట వెంకటేశం, శ్రీనివాస్, పాపయ్య, రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న రజిత

హుస్నాబాద్: విద్యార్థి దశ నుంచే సైన్స్ ప్రాజెక్టుల తయారీలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత అన్నారు. స్థానిక కేరళ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్ లావణ్య, ప్రిన్సిపాల్ రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అథ్లెట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

బెజ్జంకి(సిద్దిపేట): సిద్దిపేటలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెట్స్‌లో ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ విద్యార్థులను పాఠశాలలో ప్రిన్సిపాల్ సంగీత, పీఈటీ కనకారెడ్డి సోమవారం అభినందించారు. విద్యార్థినులు నవ్య 600 మీటర్లలో బంగారు పథకం, అలాగే 200 మీటర్లలో కె.ప్రియ రజిత పథకం, 100 మీటర్లలో కాంస్య పథకాలను సాధించినట్టు పీఈటీ కనకారెడ్డి తెలిపారు.

రాజేశ్వరస్వామి దర్శనానికి భక్తుల తాకిడి



శివుడికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పొట్లపల్లి రాజేశ్వరస్వామిని దర్శించుకొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ అన్నదానం నిర్వహించింది.

భవిష్యత్ కోసం పనిచేద్దాం

- వార్డుల్లో పారదర్శకంగా పనుల కేటాయింపు
- బఫర్ జోన్‌లో అనుమతి వద్దు
- యూజీడీ వేగవంతం చేయాలి
- స్వచ్ఛతను పెంపొందించేలా చైతన్యం
- కౌన్సిల్‌లో అజెండాకు ఏకగ్రీవ ఆమోదం



సతీశ్‌ను సన్మానిస్తున్న కౌన్సిల్ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా, సమన్వయంతో భవిష్యత్ తరాల కోసం పనిచేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్స్ పిలుపునిచ్చారు. మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కౌన్సిల్‌లో ఆమె మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా పదవీ కాలం పూర్తయిన తర్వాత స్థానికంగా ఉండాల్సి వస్తుందని, పాలకవర్గ హయాంలో జరిగిన మంచి పనులు ఎప్పటికీ నిలిచి ఉండేలా అధికారులు చేపట్టాలన్నారు. పట్టణంలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు కౌన్సిల్ సమావేశంలో వివిధ సమస్యలపై వార్డు కౌన్సిలర్లు చర్చించారు.

సిద్దిపేట మున్సిపాలిటీలో కొన్నేళ్లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సతీశ్ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందడంలో ఆయనను కౌన్సిల్ పక్షాన సన్మానించారు. అనంతరం అజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, కౌన్సిలర్లు దీప్తి, రేణుక, వరాల కవిత, తస్లిమ్, శోభారాణి, పూర్ణిమ, విఠోభ, సుందర్, రవి, నాగరాజు రెడ్డి, అరవింద్ రెడ్డి, రియాజ్, మల్లికార్జున్, సాయి ఈశ్వర్, లక్ష్మణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో చర్చకు వచ్చిన అంశాలు ఇవే..

- ప్రధానంగా పట్టణంలో 43 వార్డుల్లోను అందరికీ సమానంగా న్యాయం జరిగేలా రూ.5లక్షల చొప్పున పనులు కేటాయించాలి
- ఆయా వార్డుల్లో అసంపూర్తిగా ఉన్న యూజీడీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి
- కొన్ని వార్డుల్లో అధికంగా ఉన్న కుక్కల బెడద సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
- టౌన్ ప్లానింగ్ విభాగం పారదర్శకంగా పనిచేయాలి, నిబంధనలు పాటించేలా చూడాలి.
- ప్రధానంగా బఫర్ జోన్, శిఖం భూముల్లో నిర్మాణానికి అనుమతి ఇవ్వొద్దని, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నివేదిక ఆధారంగా మున్సిపల్ అనుమతి ఇవ్వాలి
- పట్టణ సరిహద్దు ప్రాంతాల్లో బహిరంగంగా రోడ్డుపై చెత్త వేస్తున్నారు. కట్టడి చేయాలనే తదితర అంశాలపై చర్చించారు.

రాంచంద్రారెడ్డి సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మిరుదొడ్డి(దుబ్బాక): బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

దుబ్బాక/మిరుదొడ్డి(దుబ్బాక): మాజీ ఎమ్మెల్యే డి.రాంచందారెడ్డి సేవలు మరువలేనివని, తుదిశ్వాస విడిచేంత వరకు ప్రజల మధ్యనే సాధారణ జీవితం గడిపిన గొప్పనేత అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాంచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా దొమ్మాట నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అదేవిధంగా మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాలలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రభాకరాచారి, కాసులాబాద్‌లో ముత్యాల బాలయ్య కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, బీఆర్‌ఎస్ నాయకులు కమలాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, సత్యనారాయణ, బాల్‌రాజు, ఎంపీటీసీ భైరయ్య ఉన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలో ఇటీవల తెనెటీగల దాడిలో గాయపడి చికిత్స పొందిన ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు, గీత కార్మికుడు చాట్లపల్లి బాలమల్లేశం గౌడ్‌ను పరామర్శించారు.

అభయ యాప్‌తో మహిళలకు రక్షణ

ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్



ఎస్‌ఐకు సూచనలిస్తున్న సుమన్‌కుమార్

సిద్దిపేటకమాన్: విద్యార్థినులు, మహిళలు ఆటోల్లో ప్రయాణిస్తున్న సమయంలో వారి రక్షణకు అభయ యాప్ ఎంతో ఉపయోగపడుతుందని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ అన్నారు. యాప్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సోమవారం ఆయన సూచించారు. ఏదైనా ఆపద కలిగితే క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేస్తే ఆ సమాచారం వెంటనే కంట్రోల్ రూమ్‌కు అక్కడి నుంచి సంబంధిత పోలీసులకు అందుతుందని చెప్పారు. ట్రాఫిక్ ఎస్‌ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్‌ఐలు ఉమేశ్, సదాశివరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న వెంకటస్వామి గౌడ్

మిరుదొడ్డి(దుబ్బాక)/బెజ్జంకి(సిద్దిపేట)/దుబ్బాక రూరల్: అక్బర్‌పేట-భూంపల్లి మండలానికి రూ.70లక్షల నిధులు మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ నిధుల మంజూరుకు కృషిచేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోతారం ప్రతాప్, సురేందర్‌రెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలానికి రూ.2.53కోట్ల నిధులు మంజూరైనట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ నిధులతో గ్రామాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కిచెన్ షెడ్లు, పంచాయతీ భవనాల నిర్మాణాలు చేపడతారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాకరూరల్ మండలంలోని హబ్సిపూర్ గ్రామానికి సీసీ రోడ్ల కోసం రూ.10లక్షల నిధులు మంజూరయ్యాయని, అందుకు కృషి చేసిన నాయకులకు కాంగ్రెస్ గ్రామ నాయకుడు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో నిత్య అన్నదానం



దాతలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

హుస్నాబాద్: అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షా పరులకు సోమవారం నిత్య అన్నదానం నిర్వహించారు. పట్టణానికి చెందిన దాతలు గాజుల శ్రీనివాస్, మాధవి దంపతులు అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. జనవరి 1వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పూజారి భానుమూర్తి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, గురుస్వాములు సురేందర్‌రెడ్డి, నవీన్, రవీందర్‌గౌడ్, వినయ్, భాస్కర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించిన ఘనత బీఆర్‌ఎస్‌దే



పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న హరీశ్‌రావు

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

కొండపాక(గజ్వేల్): రైతులకు ప్రాజెక్టుల నుంచి చెరువులు, కాలువల ద్వారా సాగునీటిని అందించిన ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని ముద్దాపూర్‌లో పెద్దమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠోత్సవంలో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో రైతులు ఇబ్బందులు పడకుండా రైతు బంధు జమచేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు సంక్షేమ పథకాలకు మంగళం పాడిందని ఆరోపించారు. ప్రభుత్వం కళ్లు తెరిపించి సమస్యలు పరిష్కారించేలా చూడాలంటూ పెద్దమ్మ తల్లిని ప్రార్థించానన్నారు. కార్యక్రమంలో దేవి రవీందర్, శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌చారి, మల్లం ఐలయ్య, సంపత్, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు షేక్ వలీ అహ్మద్, యాదగిరి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీని సిద్దిపేటలో ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శి వెంకట్ సోమవారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా షేక్ వలీ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా తప్పెట్ల యాదగిరి, ఉపాధ్యక్షుడుగా యాదగిరి, మహేశ్వరి, కోశాధికారిగా కృష్ణతో పాటుగా జిల్లా కార్యదర్శులు, ఆడిట్ బేరర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు వారు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి ఐదు రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించగా 11మంది పట్టుబడ్డారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.12వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

మహాపడిపూజ నేత్రపర్వం



పడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

వర్గల్(గజ్వేల్): అయ్యప్ప మహాపడిపూజతో వర్గల్ అలరారింది. పదునెట్టాంబడి జ్యోతి ప్రజ్వలన, అయ్యప్ప మాలధారుల భజనలతో వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణం సోమవారం హోరెత్తింది. శబరిమలను తలపించేలా తీర్చిదిద్దిన మండపంలో కొలువుదీరిన అయ్యప్పకు వర్గల్ స్వాములు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పూజల్లో పాల్గొన్నారు.

'జీరో టిల్లేజి'తో అధిక దిగుబడి

మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్



బక్రిచెప్యాలలో మొక్కజొన్న విత్తుకోవడాన్ని పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: జీరో టిల్లేజి విధానంలో మొక్కజొన్నసాగు ఇటీవల ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విధానం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవడంతో పాటు మంచి దిగుబడులు సాధించుకోవచ్చని అర్బన్ మండల వ్యవసాయాధికారి బి.శ్రీనాథ్ అన్నారు. మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో జీరో టిల్లేజి విధానంలో విత్తుకుంటున్న మొక్కజొన్న సాగును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలంలో సాగుచేసిన వరి కోత అనంతరం యాసంగిలో మొక్కజొన్న సాగు చేసేవారు అదే పొలంలో దుక్కి దున్నకుండా నేరుగా విత్తనాలను విత్తుకోవడాన్ని జీరో టిల్లేజి అంటారని, దీని వల్ల పంట కాలం పది రోజుల ముందుగానే అయిపోతుందన్నారు. మార్చి నాటికే పట కోతకు వస్తుందని, పంటకు నీటి ఎద్దడి సమస్యలు లేకుండా ఉంటుందని చెప్పారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వరి కోసిన తర్వాత నేలలో తగినంత తేమ లేకపోతే తేలికపాటి తడి ఇచ్చి మొక్కజొన్నను విత్తుకోవాలి
- వరుసకు వరుసకు మధ్య 60 సెం.మీ, మొక్కకు మొక్కకు మధ్య 20సెం.మీ ఉండేటట్లు విత్తాలి.
- భూమిని దున్నడం ఉండదు కాబట్టి కలుపు ఎక్కువగా వస్తుంది. దాని నివారణకు ఎకరాకు ఒక కిలో అట్రాజిన్ 50శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 48 గంటలలోపు నేలంతా బాగా తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలి
- వరి దుబ్బులు చిగురు వేయకుండా ఉండడానికి పారాక్వాట్ ఒక లీటర్ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తే ముందు లేదా విత్తిన వెంటనే పిచికారీ చేసుకోవాలి
- అవసరం అనుకుంటే అట్రాజిన్, పారాక్వాట్ కలిపి కూడా పిచికారీ చేసుకోవచ్చు
- ఎరువుల వినియోగం, సస్యరక్షణ చర్యలు లాంటివి సాధారణ రబీ మొక్కజొన్న పంటకు పాటించనట్టుగానే పాటించుకోవాలి.

చివరి దశలో కేజీబీవీ పనులు

- డిసెంబరుకల్లా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశం
- జోరుగా సాగుతున్న పనులు
- ఇబ్బందుల్లోనే కొనసాగుతున్న విద్యాలయం



నిర్మాణంలో ఉన్న కేజీబీవీ భవనం

అక్కన్నపేట(హుస్నాబాద్): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు చివరి దశకు చేరుకున్నాయి. మండల కేంద్రంలో రూ.3.50కోట్ల వ్యయంతో 2021లో ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి మూడేళ్లుగా పనులు సాగుతున్నాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు మళ్లీ జోరందుకున్నాయి.

కలెక్టర్ ఆదేశాలు..

డిసెంబర్ 31 నాటికల్లా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి ఇటీవల ఆదేశించారు. దీంతో సదరు కాంట్రాక్టర్ పనులను కొనసాగిస్తున్నారు. తరగతి గదులన్నిటిలోను టైల్స్, విద్యుత్‌కు సంబంధించిన చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఏదీ ఏమైనా రెండు, మూడు నెలల్లో ఈ భవన నిర్మాణ పనులు పూర్తిచేసి అప్పగించేందుకు కృషి చేస్తున్నట్లు గుత్తేదారుడు చెబుతున్నాడు.

అసౌకర్యాలతోనే కొనసాగింపు

అయితే మండల కేంద్రంలో కొనసాగుతున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అసౌకర్యాల నడుమ నెట్టుకొస్తున్నారు. అద్దె భవనంలో కొనసాగడంతో సరైన సౌకర్యాలు లేకపోవడమే కాకుండా బాలికలకు సరిపోను మరుగుదొడ్ల సదుపాయాలు లేవు. అద్దె భవనంలో ఉన్న కేజీబీవీని త్వరగా ఖాళీ చేయాలన్న ఒత్తిడి సైతం ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. దీంతో సొంత భవనం పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

డిసెంబరులో పూర్తి కానున్నది

కలెక్టర్ మను చౌదరి డిసెంబర్ 31కల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ దిశగా భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. టైల్స్, గదుల్లో విద్యుత్ కనెక్షన్‌తో పాటు చిన్నచిన్న పనులే మిగిలాయి. త్వరగా భవన నిర్మాణ పనులు పూర్తిచేసేలా ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నాం.

– సాయికిరణ్, ఏఈ విద్యాశాఖ

సంక్షిప్త వార్తలు

◆ రైతుల సహకారం అవసరం

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆయా గ్రామాల్లో నిర్మించనున్న డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ అనంతరెడ్డి కోరారు. మండలంలోని మల్లంపల్లిలో కాలువల నిర్మాణం కోసం సోమవారం భూ సేకరణ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా పంటపొలాలకు సాగునీరు పుష్కలంగా వస్తుందన్నారు. నీటిపారుదల శాఖ డీఈ కరుణశ్రీ, ఎంపీఓ మోహన్‌నాయక్, రెవెన్యూ సిబ్బంది, ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

◆ సన్నవడ్ల కొనుగోళ్లు ప్రారంభించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రతి కొనుగోలు కేంద్రంలోను సన్నవడ్ల కొనుగోళ్లను ప్రారంభించాలని వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకులు ముత్తినేని వేణుగోపాల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

◆ పేదలకు అండగా సీఎం సహాయనిధి

మిరుదొడ్డి(దుబ్బాక): సీఎం సహాయనిధి నిరుపేదలు అండగా నిలుస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు అన్నారు. చెప్యాల, మిరుదొడ్డి, కాసులాబాద్, ఆరెపల్లి, అందె గ్రామాలకు చెందిన పది మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మల్లేశం, రమేశ్, భాను, రాములు, కరుణాకర్, శంకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ బాధిత కుటుంబానికి సాయం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల గ్రామానికి చెందిన నిరుపేద గోవిందారం శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఫార్మర్ ఫస్టు ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. రూ.15వేల నగదు, క్వింటాల్ బియ్యం అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

◆ ప్రజాపాలనపై పార్టీలతో సమావేశం

హుస్నాబాద్‌రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలనపై వివిధ రాజకీయపార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు. పంచాయతీల్లో చేపట్టే పనుల జాతర, అభివృద్ధి పనుల మంజూరుపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

◆ వెన్నెలకు శుభాకాంక్షలు

దుబ్బాక: తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం సందర్భంగా సోమవారం గమ్మడి వెన్నెల(గద్దర్ కూతరు)ను నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ 'పసిడి పలుకులు'కు ఆర్థిక సహాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రముఖ కవి, బాల సాహిత్య రచయిత అమ్మన చంద్రారెడ్డి బాలల కోసం రచించిన 'పసిడి పలుకులు' పుస్తక ప్రచురణకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆర్థిక సహాయం అందించడానికి ఉత్తర్వులు జారీ చేసిందని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం సోమవారం తెలిపారు. ఆయనకు జిల్లాలోని కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

◆ ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మర్మాముల, గ్రామ పరిధిలోని బంజారా గ్రామంలో రెండు ట్రాక్టర్ బ్యాటరీలు ఆదివారం రాత్రి చోరీకి గురయ్యాయి. బాధిత రైతులు డాకూరి తిరుపతి రెడ్డి, చిగుళ్ల లక్ష్మణ్ ట్రాక్టర్‌లను తమ వ్యవసాయ బావుల వద్ద ఉంచారు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. గ్రామంలో దొంగల బెడద ఎక్కువైందని, సీసీ కెమెరాలు పనిచేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో బ్యాటరీ ఖరీదు రూ.10వేల వరకు ఉంటుందని బాధితులు వాపోయారు.

◆ క్రీడా స్ఫూర్తితో సాగాలి

సిద్దిపేటజోన్: గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో సాగాలని సీఎం రేవంత్ క్రికెట్ టోర్నీ ప్రతినిధి నరేందర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది రాజలింగం సూచించారు. స్థానిక క్రికెట్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ క్రీడాకారులకు వారు అవార్డులు అందజేశారు.

◆ పార్టీ బలోపేతానికి కృషి చేయండి

కోహెడరూరల్(హుస్నాబాద్): పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమలరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వరికోలు, నారాయణపూర్ గొట్టమిట్ల, రాంచంద్రపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఆ పార్టీ అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ఆధ్వర్యంలో బూత్ కమిటీలను ఎంపిక చేశారు. సురేందర్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.